# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 43 | బుధవారం, 30 అక్టోబర్ 2024 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## కాంగ్రెస్ మరింత వేధించొచ్చు

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

ఈఆర్సీ తిరస్కరించినందుకు పార్టీ శ్రేణులు సంబురాలు జరపండి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజల పై రూ.18500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా ఈ సంబురాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మిగతా 2లో..



## బీఆర్ఎస్ 'విద్యుత్తు' విజయం

ఈఆర్సీ బహిరంగ విచారణలో వాదనలు వినిపించిన కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు

పెంపు ప్రతిపాదనను తిరస్కరించిన ఈఆర్సీ 2




# వృద్ధులకు కేంద్రం గుడ్‌న్యూస్

## 70 ఏళ్లు పైబడిన వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ పథకం

**సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఫ్రీ ట్రీట్‌మెంట్**

హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ప్రారంభించిన ప్రధాని మోడీ

ఢిల్లీ, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లోని వృద్ధులకు ప్రధాని క్షమాపణలు

**ప్రజాస్వరం, నేషనల్ బ్యూరో :**

డెబ్బై ఏళ్లు పైబడిని వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం నుంచి శుభవార్త. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 సంవత్సరాల వయసు కంటే ఎక్కువ ఉన్న వారికి హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ప్రారంభించారు ప్రధాని నరేంద్ర మోడీ. ధన్వంతరి జయంతి సందర్భంగా న్యూ ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. పీఎం మోడీ లబ్ధిదారులకు ఆయుష్మాన్ వయ వందన మిగతా 2లో..

## సంగారెడ్డిలో హార్ట్ స్టెంట్ తయారీ పరిశ్రమ

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ 2

## కేసీఆర్ ఉనికి లేకుండా చేయడమే టార్గెట్

కేటీఆర్‌తోని కేసీఆర్ ఉనికి లేకుండా చేశాను

మూసీపై అఖిలపక్షానికి రెడీ

కేసీఆర్.. కేటీఆర్ బామ్మర్దులు పార్టీలు చేసుకోవడానికి ఫాం హౌస్‌లు ఉన్నాయి

మూసీ పక్కన సామాన్య ప్రజలు దుర్భర జీవితం గడపాలా

చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఉనికి లేకుండా చేయాలనేది తన అభిమతం అన్నారు. కేటీఆర్‌తోని కేసీఆర్ ఉనికి లేకుండా చేశాను.. కేసీఆర్ ఉనికి లేకుండా చేయడానికి ఆయన కొడుకునే వాడానని అన్నారు. ఇక భవిష్యత్తులో కేటీఆర్‌ని మిగతా 2లో..

## ఆరోపణలన్నీ అవాస్తవాలే



నేనే ఆయనపై లీగల్ యాక్షన్‌కు సిద్ధమవుతున్నా

రాష్ట్రంలో రేవంత్, కేటీఆర్, హరీశ్ ప్రభుత్వమే ఉంది

ఈ రెండు పార్టీలు నాటకాలాడుతున్నాయి

సంక్షేమాన్ని గాలికొదిలి ఆందోళనంటూ రాజకీయం చేస్తున్నాయి

కేంద్రమంత్రి బండి సంజయ్ 2

## లాయర్లపై లాఠీఛార్జి

**బెయిల్ పిటిషన్ విషయంలో లాయర్లు, జడ్జ్ మధ్య గొడవ** 2

ఆందోళన చేపట్టిన అడ్వకేట్లు.. కోర్టులో ఉద్రిక్తత

పోలీసులను పిలిపించి కోర్టులోనే లాయర్లపై లాఠీచార్జ్..

ఘజియాబాద్ జిల్లా సెషన్స్ కోర్టులో ఘటన





## ప్రజాభిప్రాయం మేరకే ప్రతిపాదనలు

బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ వెల్లడి

కలెక్టరేట్‌లో రిజర్వేషన్లపై బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ

పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం 2

## రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతలరెడ్డి



ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతులను మోసం చేశాడు

వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలిచ్చి.. ఒక్కటి కూడా అమలు చేయలే..

రైతుల కోసం ఎందాకైనా కొట్లాడుతాం

రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు 2

## పోలీసులకు సరెండర్ లీవ్స్ బడ్జెట్

రూ.182.48 కోట్లు మంజూరు చేసిన సర్కార్



2



## వికసిత్ భారత్ వైపు పరుగులు

వచ్చే 25 ఏళ్లు దేశానికి అమృతకాలం 2

మోదీ నాయకత్వంలో అన్ని విధాల అభివృద్ధి

రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# ఆరోపణలన్నీ అవాస్తవాలే

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

ఫోన్‌ట్యాపింగ్, మాదకద్రవ్యాల వ్యవహారాలలో తనపై నిరాధార ఆరోపణలు చేశారని , దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ . వారంలోపు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీస్ పంపారు.. దీనిపై బండి స్పందిస్తూ, నిత్యం అబద్దాలు చెప్పే వాళ్లు ఇచ్చే నోటీసులకు విలువ ఏముంటుందని అన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, లీగల్ నోటీసుల్లో కేటీఆర్ చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి, అవాస్తవమని పేర్కొన్నారు. దురుద్దేశపూర్వకంగానే తనకు లీగల్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. తనపై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై తాను కూడా త్వరలోనే ఆయనకు నోటీస్ పంపుతానన్నారు.

**బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌ల మధ్య లడాయి..**

బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య పంచాయతీ నడుస్తోందంటూ సంచలన ఆరోపణలు చేశారు బండి సంజయ్. ఇక రాష్ట్రంలో ఆర్.కే.హెచ్ (రేవంత్, కేటీఆర్, హరీష్‌రావు) ప్రభుత్వం నడుస్తోందని కామెంట్ చేశారు. బిఆర్ ఎస్ ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నారంటూ ఆరోపించారు.. రెండు పార్టీలు కూడబలుక్కుని ఆందోళలను అంటూ సంక్షేమ పథకాలను అటకెక్కిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు.

**బామమరిది ఇంటిలో మందు దొరికితే ధర్నాలా..**

కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మందు దందాలో దొరికితే బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసింది కాక.. ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు దొంగ నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు కేసీఆర్ లేకపోతే.. కేటీఆర్‌ను ఎవరూ పట్టించుకోరన్నారు.

**మూసీ పునరుజ్జీవానికి అనుకూలమే కానీ..**

తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని.. పేదలను ఇబ్బందులకు గురి చేస్తే మాత్రం ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు బండి సంజయ్. పేదలు జోలికి వస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ సర్కార్‌ను హెచ్చరించారు.

# పోలీసులకు సరెండర్ లీవ్స్ బడ్జెట్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్ లకు సంబంధించిన బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో విడుదల చేసింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌ల బడ్జెట్‌గా రూ.182.48 కోట్లను విడుదల చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బడ్జెట్‌ను మంజూరు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వాన్ని అనుసరించి, సరెండర్ లీవ్‌లకు సంబంధించి భారీ స్థాయిలో బడ్జెట్ విడుదల చేయడం ద్వారా పోలీస్ సిబ్బంది ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అభ్యర్థనను తీర్చింది. పోలీస్ అధికార సంఘాలు ఈ బడ్జెట్ విడుదలపై హర్షం వ్యక్తం చేశాయి. మరోవైపు, మిగిలిన బకాయిలను త్వరగా దశలవారీగా మంజూరు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**డీఏల సంగతేమిటి..?**

పోలీసులకు చెల్లించాల్సిన డీఏలు ఐదు ఉండగా.. ఇటీవల దీపావళికి ఒక డీఏ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మిగతా డీఏలతోపాటు పెండింగ్ బిల్లులు, వారాంతపు సెలవును మంజూరు చేయాలని పోలీసులు కోరుతున్నారు.

# లాయర్లపై లాఠీఛార్జి

**ప్రజాస్వరం, నేషనల్ బ్యూరో :**

లా అండ్ ఆర్డర్‌ని కాపాడటంలో పోలీసులు, న్యాయస్థానాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. మరి న్యాయస్థానాలే అల్లర్లకు అడ్డాగా మారితే.. లాయర్లు, జడ్జిలమధ్య గొడవలు జరిగితే. భౌతిక దాడులకు దిగితే.. అవును.. ఇది అనుకోవడానికి విచిత్రంగా ఉన్నా.. నిజంగా జరిగింది. గౌరవప్రదమైన న్యాయస్థానం అని కూడా మరిచిపోయి లాయర్లు, జడ్జి పోరుకు దిగారు. వీరిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీకి పని చెప్పారు. దీంతో 10 మంది లాయర్లు గాయపడ్డారు. ఘజియాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు దగ్గర అక్టోబర్ 29న ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓ కేసు విషయంలో జడ్జ్ వైఖరిని తప్పుబడుతూ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకారులను చెదర గొట్టడానికి న్యాయవాదులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. 10 మంది న్యాయవాదులు గాయపడ్డారు. జిల్లా సెషన్స్ జడ్జి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రాసిక్యూషన్ ప్రత్యేక విచారణ కోసం కేసును వాయిదా వేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ కోర్టును ఆశ్రయించాడు. తమ వంతు వచ్చే వరకు వేచి ఉండాలని న్యాయమూర్తి వారికి సూచించారు. లాయర్లు దానికి ఒప్పుకోలేదు. దీంతో అసంతృప్తి చెందిన న్యాయవాదులు కోర్టు ఆవరణలోనే అరుచుకుంటూ గోల చేశారు. పరిస్థితి అదుపు తప్పి జడ్జ్, న్యాయవాదులకు మధ్య గొడవకు దారితీసింది. దీంతో కోర్టు పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు జస్టిస్ కుమార్ పోలీసులను పిలిచారు. లాఠీలతో పోలీసులు జోక్యం చేసుకుని గుంపును చెదరగొట్టారు. పలువురు లాయర్లు గాయపడ్డారు. తరువాత వారిని చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించారు.

# వృద్ధులకు కేంద్రం గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాయి)




కార్డును అందజేశారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించినట్లు సెప్టెంబర్ లో ప్రకటించారు. సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 ఏళ్లు కంటే ఎక్కువ వయసు ఉన్న సీనియర్ సిటిజన్ల అందరికీ హెల్త్ సెక్యూరిటీని ఇవ్వడానికి ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా వారు ప్రతి సంవత్సరం వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోవడానికి రూ. 5లక్షల కవరేజీ వర్తిస్తోంది. న్యూఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌లో ఎందుకు చేరలేదని ప్రధాని ప్రశ్నించారు. ఢిల్లీ, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లోని వృద్ధులను ప్రధాని క్షమాపణలు కోరారు. తాను దేశ ప్రజలకు సేవ చేయగలనని, కానీ, రాజకీయ అడ్డుకట్టల కారణంగా ఇక్కడి ప్రజలకు నేను సేవ చేయలేకపోతున్నా అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంలో పశ్చిమ



బెంగాల్, ఢిల్లీ రాష్ట్రాలు చేరలేదు.. అందుకే మోదీ ఇలా అన్నారు.

**సంగారెడ్డిలో హార్ట్ స్టెంట్ తయారి పరిశ్రమ...**

సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్ మెడికల్ డివైజ్ పార్కులో హార్ట్ స్టెంట్లు తయారి పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. ముంగళవారం ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ హార్ట్ స్టెంట్ తయారి పరిశ్రమను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబులు వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ దేశీయంగా స్టంట్ లు తయారు చేయడం వల్ల గుండె ఆపరేషన్ల ఖర్చు తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో గుండె ఆపరేషన్లకు సంబంధించి స్టంట్లను తయారుచేసి సహజ ఆనంద్ మెడికల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కావడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. ధన్వంతరి జయంతి 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించడం సంతోషకరమన్నారు. సహజానంద్ టెక్నాలజీ ప్రైవేట్ సంస్థ గుండె ఆపరేషన్లలో కీలకమైన స్టంట్లను తయారు చేయునట్లు మంత్రులు తెలిపారు. దేశీయంగా స్టంట్ లు తయారు చేయడం వల్ల గుండె ఆపరేషన్ల ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు. ఇలాంటి పరిశ్రమ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ డివైస్ పార్కులో ఏర్పాటు కావడం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, టీజీఐఐ విష్ణువర్ధన్ రెడ్డి, సీఎంవో కార్యాలయ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఆర్డీవో రవీందర్ రెడ్డి, సహజానంద్ మెడికల్ టెక్నాలజీ ఎండీఎస్‌హెచ్ ధీరజ్ లాల్ కోటాడియా, పరిశ్రమల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతలరెడ్డి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు కొత్త పేరు పెట్టారు. అన్ని పథకాలను.. హామీలను ఎగవేస్తుండడంతో ఎగవేతల రెడ్డి అంటూ ఎమ్మెల్యే హరీశ్ రావు నామకరణం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. రైతుల కోసం ఎందాకైనా కొట్లాడుతామని ప్రకటించారు.రైతులకు రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుండా మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వనపర్తిలో రైతాంగ, ప్రజా నిరసన సదస్సు నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'రేవంత్‌రెడ్డి పాలనలో కొత్త పథకాలు రాలేదు, ఉన్న పథకాలు బంద్ పెడుతున్నడు. బతుకమ్మ చీరలు లేవు, కేసీఆర్ కిట్లు లేవు, చెరువుల్లో చేప పిల్లలు లేవు' అని తెలిపారు. 'బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుండడంతో ఈ మాత్రమైనా చేస్తున్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలు ఇచ్చారు. ఒక్కటైనా అమలు అవుతుందా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'అయితే దేవుడి మీద ఒట్లు అడిగితే తిట్లు. తిట్లతో పాటు కేసులు కూడా ఉన్నాయి' అని చెప్పారు. 'తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ, చంద్రబాబు, వైఎస్ మీద పోరాటం చేసినోళ్లం' అని గుర్తు చేశారు. రుణమాఫీ లోక్‌సభ ఎన్నికల్లో పంద్రాగస్టు వరకు చేస్తామని చెప్పి మాట తప్పారు. ఈయన చెబితే నమ్మరని దేవుళ్ల మీద ఒట్లు వేసిండు. కురుమూర్తి, జోగులాంబ, లక్ష్మి నరసింహ స్వామి మీద ఒట్లు వేసి మాట తప్పారు' అని వివరించారు. ఇప్పటివరకు సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. కేసీఆర్ అందరికీ రైతుబంధు ఇస్తే నిబంధనలు పెట్టి రుణమాఫీ ఎగవేశారు' అని హరీశ్ రావు విమర్శించారు. పాలకుడు దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మాట తప్పితే రాష్ట్రానికి అరిష్టం అవుతుందని నేను దేవుడి దగ్గరకి వెళ్లాను. ప్రజలను కాపాడు.. పాపాత్ముడిని క్షమించు అని వేడుకున్నా' అని వివరించారు. దానికి కూడా నా మీద కేసులు పెట్టారని చెప్పారు.

# కేసీఆర్ ఉనికి లేకుండా చేయడమే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయంగా లేకుండా చేయడానికి ఆయన బావ హరీశ్‌రావుని వాడుతానని తెలిపారు. మరోవైపు.. మూసీపై అఖిలపక్షానికి రెడీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు తనను కలవడం ఇష్టం లేకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికైనా మూసీపై అభిప్రాయాలు ఇవ్వండని సూచించారు. ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి.. ఎలాంటి అభిప్రాయాలనైనా తీసుకోవడానికి తాను రెడీగా ఉన్నానని సీఎం చెప్పారు. చర్చ జరగకుండా అభివృద్ధి జరగదు.. తాను మూసీ పై చర్చ జరగాలని కోరుకుంటున్నాను.. అందుకే మిమ్మల్ని ఆహ్వానిస్తున్నానని సీఎం పేర్కొన్నారు. అఖిలపక్షానికి మీరు వస్తే కచ్చితంగా మూసీ పై అఖిలపక్షం పెడతానని అన్నారు. మూసీలో జీవించడానికి.. మూసీ పక్కన ఉండడానికి ఎవరికి ఇష్టం ఉండదు.. మూసీలో లగ్జరీ ఉంటుందా అని సీఎం పేర్కొన్నారు. కేటీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్‌కు ఎందుకు అర్థం కావడం లేదన్నారు. మూసీ జనాలను మూసీలోనే ఉండాలని కోరుకుంటున్నారా.. ఈటల రాజేందర్ మూసీ పైన చేస్తున్న అభ్యంతరాలు నిర్మాణాత్మకంగా లేవు.. అతనిపైన కేటీఆర్, హరీష్ రావు ఒత్తిడి ఉందని సీఎం తెలిపారు. మూసీ పునర్జీవం కోసం రూ. 1,50,000 కోట్లు ప్రభుత్వం నుంచి ఖర్చు పెడుతున్నారు అనేది నిజం కాదు.. నిధులన్నీ ప్రైవేటు సంస్థలతోనే సమీకరించి వాళ్లతోనే ఖర్చు చేయించి మూసీని సుందరీకరణ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మరోవైపు.. కేసిఆర్, కేటీఆర్ బామ్మర్దులు పార్టీలు చేసుకోవడానికి ఫార్మ్ హౌస్‌లు ఉన్నాయి. మూసీ పక్కన సామాన్య ప్రజలు దుర్భర జీవితం గడపాలా అని అన్నారు. గండిపేట ఏరియాలో ఫామ్ అవధులు కట్టుకొని మీ కాలుష్యం అంతా మూసీ పైన వదులుతున్నారు. వాళ్లు ఆ కాలుష్యంతో బతకాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇప్పుడు నాలుగు గోడల మధ్య పరిమితమై ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యాడు అంటే అది తన వల్లే అయిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కేటీఆర్‌ని బయటికి తీసుకొచ్చి తండ్రిని ఫామ్ హౌస్ పరిమితం చేశాని ముఖ్యమంత్రి తెలిపారు.

# కాంగ్రెస్ మరింత వేధించొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. 10 నెలల్లోనే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేయడంతో, ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించగలిగామని కేటీఆర్ అన్నారు. మొత్తం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి ఇప్పటి వరకు ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించడం ఇదే మొదటిసారి అని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఈ సందర్భం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్ర ప్రజలపై అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సరైన పద్ధతిలో శాస్త్రీయంగా ఈఆర్‌సీ ముందు ఉంచడంలో విజయం సాధించామన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తనతో పాటు మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఈఆర్‌సీని కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరారని, ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ప్రజల తరపున వాదనలను గట్టిగా వినిపించారన్నారు. తాను స్వయంగా సిరిసిల్లలో జరిగిన విద్యుత్ చార్జీల పెంపు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ప్రజల వాదనను ఈఆర్‌సీకి ఒప్పించడం జరిగిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈఆర్‌సీ ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన వ్యతిరేకతను, ప్రజాభిప్రాయ సేకరణను, ప్రధాన ప్రతిపక్షంగా తాము వినిపించిన వాదనలను పరిగణనలోకి తీసుకొని ప్రజలపై భారీ విద్యుత్ భారాన్ని మోపకుండా ప్రభుత్వాన్ని నియంత్రించిన తీరు గొప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలపై భారీ విద్యుత్ భారం మోపకుండా ప్రజల పక్షాన నిలిచిన ఈఆర్‌సీకి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి జిల్లా కేంద్రంతో పాటు, నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ చార్జీల పెంపును ఆపినందుకు ప్రజల తరపున సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు.

# వికసిత్ భారత్ వైపు పరుగులు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. రాబోయే 25 ఏళ్లు దేశానికి అమృత కాలమని అన్నారు. హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ భారతీయ విద్యా భవన్ పాఠశాల లో నేడు నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఎంపికైన 155 మందికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతను వినియోగించుకోవడం అవసరం అని అన్నారు. యువ శక్తితో ఎన్నో అద్భుతాలు చేయవచ్చని అన్నారు. నేడు ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్ చేరిందని అన్నారు. దాదాపు 75 దేశాలకు డిఫెన్స్ పరికరాలను ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. దేశంలో శాంతి భద్రతలను అదుపులో లేకపోతే పెట్టుబడులు రావని అంటూ ఇప్పటికే ఉగ్రవాద చర్యలపై ఉక్కుపాదం మోపామని పేర్కొన్నారు. వ్యవసాయ విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని అన్నారు. ఎక్కడా విద్యుత్ కొరత అనేది లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని, అన్ని రంగాల అభివృద్ధికి సహకరిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర పథకాలను సమర్ధవంతంగా వినియోగించుకోవడం లేదని అన్నారు.. పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా కాంగ్రెస్ సర్కార్ అందుకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ సమకూర్చడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

# దీపావళి అంటే చిచ్చుబుడ్లు కాలుస్తారు

## కేటీఆర్.. మీరు విదేశీ మద్యంతో జరుపుకుంటారా?

## సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



జన్వాడ ఫాంహౌస్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారని, కానీ దీపావళి వేడుక పేరుతో ఫాంహౌస్‌లో మాత్రం సారాబుడ్లు బయటకు వచ్చాయన్నారు. కేటీఆర్ దీపావళి పండుగను విదేశీ మద్యంతో జరుపుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. జన్వాడ ఫాంహౌస్‌పై బీఆర్ఎస్ కట్టుకథలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమయం వచ్చినప్పుడు తాను మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తానని... అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు నడుస్తానని... బీఆర్ఎస్ నేతలు కూడా రావాలన్నారు. బీఆర్ఎస్ అక్రమ సొమ్ముతో సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది హైడ్రా వల్ల కాదని, దేశవ్యాప్తంగా స్తబ్దుగానే ఉందన్నారు. సినిమాలలో రాజమౌళిది, వర్మది వేర్వేరు స్టైల్ అని, అలాగే రాజకీయాల్లో తన స్టైల్ తనది... కేటీఆర్ స్టైల్ కేటీఆర్‌ది అన్నారు. నాది చిన్న వయస్సు, రాజకీయంగా ఇంకా ఎంతో భవిష్యత్తు ఉంది... కాబట్టి అణిచివేతతో ప్రజాగ్రహాన్ని చూడాలని లేదు అన్నారు. ప్రజాస్వామ్యంగానే ముందుకు సాగుతానని తెలిపారు. రాజకీయంగా కేసీఆర్ పని అయిపోయిందన్నారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి వెళ్లారని విమర్శించారు. టీజీపీఎస్సీ నియామకాల్లో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే అన్నారు.

# ప్రజాభిప్రాయం మేరకే ప్రతిపాదనలు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



ప్రజాభిప్రాయం మేరకే రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచుతామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. ప్రజల సలహాలు, సూచనలను, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసు కుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలను స్వీకరించేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మితో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. బీసీ సంఘాల నాయకులతోపాటు వివిధ వర్గాల వారు హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్‌కు అందించారు. మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిర్దేశిత నమూనాలో అ ఫిడవిట్ తో కూడిన వినతులు కమిషన్‌కు సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

**శాస్త్రీయ పద్ధతిలో...**

రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రతిపాదనలను రూపొందించేందుకు బీసీ కమిషన్ కసరత్తు చేస్తోందని చైర్మన్ నిరంజన్ అన్నారు. కమిషన్ విధివిధానాలను ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని, ఇందులో భాగంగా స్థానిక సంస్థల్లో ఆయా వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అధ్యయనం కోసం బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపడుతోందన్నారు. బీహార్‌లో 62 శాతం బీసీల జనాభా ఉందన్నారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయాలని అక్కడి ప్రభుత్వం భావించగా, ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరించిందన్నారు. కర్ణాటకలో సైతం సర్వే నిర్వహించినప్పటికీ గత దశాబ్ద కాలంగా నివేదికను వెల్లడించలేని స్థితి నెలకొందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. కుటుంబ సర్వేలో పూర్తి సమాచారం అందించేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కుల సంఘాల ప్రతినిధులను కోరారు. నవంబర్ 13వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్‌లైన్‌లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్ 9 లోగా నివేదిక అందజేస్తామని తెలిపారు.

# బీఆర్ఎస్ 'విద్యుత్తు' విజయం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

ప్రజలపై ప్రభుత్వం మోపేందుకు సిద్ధమైన రూ. 18,500 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అపురూప విజయాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో మంగళ, బుధవారాల్లో సంబురాలు చేసుకోవాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఎన్నడూ విద్యుత్తు చార్జీలు పెంచలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పది నెలల్లోనే రూ. 18,500 మేర విద్యుత్తు చార్జీలు పెంచేందుకు ప్రయత్నించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా బహిరంగ విచారణలో పాల్గొని విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)ని ఒప్పించగలిగామని కేటీఆర్ గుర్తుచేశారు. చార్జీల పెంపు ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించి విజయం సాధించడం అసాధారణ అంశమని, ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**ప్రజల తరఫున వాదనలు...**

పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా తనతో పాటు విద్యుత్తుశాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఈఆర్సీని కలిసి విద్యుత్తు చార్జీల పెంపును ఆపాలని కోరామని కేటీఆర్ తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ పాల్గొని ప్రజల తరఫున వాదనలు వినిపించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను స్వయంగా సిరిసిల్లలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ఈఆర్సీని ఒప్పించినట్టు తెలిపారు.



## హనుమాన్ ఆలయం వద్ద పులిహోర పంపిణీ

**గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే పులిహోర పంపిణీ దాతగా బొజ్జ సంతోష్‌కుమార్, బొజ్జ శాలిని, బొజ్జ వర్షిణి, బొజ్జ రక్షిత్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోముల మహేందర్, కైలాస ప్రశాంత్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ నిర్వహించడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## నిందితులకు 14 రోజుల రిమాండ్



**దౌల్తాబాద్, అక్టోబర్ 29( ప్రజాస్వరం) :**

ఈతకల్లు దొంగతనం చేశారని నేరం మోపి జరిమానా విధించడంతో మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్యాల ఆంజనేయులు(34) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి అదే గ్రామానికి చెందిన తొడంగి స్వామి, తొడంగి ఆంజనేయులు, ఈరంగారి ఎల్లం, తొడంగి పర్శరాములు, తొడంగి స్వామి, తొడంగి రాంచంద్రం, తొడంగి కర్ణాకర్‌లను మంగళవారం జిల్లా మున్సిఫ్ జుడీషియల్ ప్రథమ శ్రేణి గజ్వేల్ కోర్టు జడ్జి ప్రియాంక ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**నిజాంపేట, అక్టోబర్ 29 (ప్రజా సర్వం) :**


మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో ఇన్నోవా బైక్ ఢీకొని అర్జున్ (9) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం జడ్చెరువు తండా గ్రామానికి చెందిన శత్రు అతని కుమారుడు అర్జున్ గాంధారి హాస్టల్ నుండి బైక్‌పై వస్తుండగా నందిగామ గ్రామ శివారులో సిద్దిపేట నుండి వస్తున్న కారుకు ఢీకొనడంతో అర్జున్ చనిపోగా అతని తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

**నార్సింగి, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

చేపల వేటకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలోని కాముని చెరువులో చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ కథనం ప్రకారం సయ్యద్ షకీల్ (27) తండ్రి సయ్యద్ సాజిద్, వృత్తి ప్లంబర్ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం తన మిత్రుడు కండ్లకోయ అశోక్‌తో చేపల వేట కోసం చెరువుకు వెళ్లాడు. చేపల వేట కోసం ఇరువురు చెరువులోకి దిగి వేరు వేరు చోట గాలాలు వేశారు. సయ్యద్ షకీల్ ప్రమాదవశాత్తు కాలు జారీ చెరువులోకి పడగా కాళ్లకు చెరువులో ఉన్నవలలు చుట్టుకుని నీట మునిగి మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# వాహనదారులు జర భద్రం..



**దౌల్తాబాద్, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని దౌల్తాబాద్‌లోని ఆయా గ్రామాల్లో ద్విచక్ర వాహనాలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలు, దొంగతనాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వాహనదారులు పొద్దంతా పొలాలు చేసి రాత్రి తన ఇంటి వాకిల్లలో వాహనాలు నిలపడం మూలంగా దొంగతనాలు చేసేవారికి అమృతంతో పెట్టిన విద్యగా మారుతుంది. మండల కేంద్రమైన దౌల్తాబాద్ పట్టణంలో ఆదివారం సంత కావడం చేత చేగుంట మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, రామయంపేట మండలాల ప్రజలు దౌల్తాబాద్ పట్టణానికి వ్యాపారరీత్య ప్రతి ఆదివారం వస్తుంటారు. వ్యాపారాన్ని చేసుకుంటున్నా క్రమంలో తమ తమ వాహనాలను పట్టణంలో ఉంచి వారి పనుల్లో మమేకమై ఉన్న సమయంలో దొంగలు వారు వచ్చాక ద్విచక్ర వాహనాలతో పాటు మొదలగు వాహనాలను దొంగతనం చేస్తున్నారు. ఈ నెల 26న మాచినపల్లి గ్రామానికి చెందిన స్వామి అనే వ్యక్తి శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని మాచినిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి స్వామి వాళ్ళ అక్క దౌల్తాబాద్‌లోని స్వప్న ఇంటికి వచ్చి ఆమె



వాకిట్లో ఉంచారు. ఇంట్లోకి వెళ్లి బయటకు వచ్చే సమయంలో ఎవరో గుర్తుని వ్యక్తులు దొంగలించారు. దొంగలించబడ్డ ద్విచక్ర వాహనం మెదక్ జిల్లా మాసాయిపేట మండల శివారులో యాక్సిడెంట్ జరిగింది. ఆ వ్యక్తి ఎవరనేది తెలవాల్సిన ఉంది. మాసాయిపేట పోలీసులు ద్విచక్ర వాహనం నెంబర్‌ను ఆన్‌లైన్‌లో చెక్ చేయగా దౌల్తాబాద్ మండలంలోని మాచినిపల్లి గ్రామానికి చెందిన స్వామి వాహనమని తెలిసింది. ఆదివారం దౌల్తాబాద్ పోలీసులకు సమాచారాన్ని అందించగా వెంటనే మాచినపల్లి గ్రామస్థాయి పోలీస్ అధికారులకు సమాచారం అందించడంతో బాధితుడికి దౌల్తాబాద్ పోలీసులు సమాచారం అందించడంతో ఆదివారం మాసాయిపేట పోలీస్ స్టేషన్‌కి వెళ్లి వాహనాన్ని తెచ్చుకోవడం జరిగింది. అందుకోసం మండల వాహనదారులు తమ, తమ వాహనాలను భద్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ నిఘా నేత్రలను ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల స్థానిక సీఐ లతీఫ్ ఓ సమావేశంలో తెలిపారు. ఇకనైనా ప్రజలు తమ తమ వాహనాలను జాగ్రత్త కాపాడం కోసం నిఘా నేత్రాలను తప్పనిసరిగా బిగించుకోవాలని స్థానిక పోలీసులు వివరించడం జరిగింది.

## పారిశుధ్య కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి

**తూప్రాన్, అక్టోబర్ 29, ప్రజాస్వరం :**

మున్సిపల్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నెలకు రూ. 26 వేల జీతం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్‌లో పనిచేసే కార్మికులతో కలిసి మున్సిపల్ ఆఫీస్ దగ్గర సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపల్‌లో పనిచేసే కార్మికులు సీఐటీయూలో చేరడంతో సీఐటీయూ పతాకావిష్కరణ చేశామన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. మున్సిపల్ కార్మికుల పనికి తగ్గట్లుగా నెలకు రూ.26 వేల వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తూప్రాన్ మున్సిపల్ పరిశుధ్య కార్మికులు జెండా ఆవిష్కరణ చేయడానికి మున్సిపాలిటీ వారు అనుమతి ఇవ్వకపోవడంతో పక్కన ఉన్న ప్రైవేట్ ప్రాంతంలో జెండా ఆవిష్కరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, నాయకులు ఆసిఫ్, తూప్రాన్ మున్సిపల్ పట్టణ కమిటీ అధ్యక్షులు బాబు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి సుజాత, ఉపాధ్యక్షులు సత్తయ్య, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పది

### బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి



**దౌల్తాబాద్, అక్టోబర్ 29( ప్రజాస్వరం) :**

అన్ని దానాలకంటే విద్యాదానం మహా గొప్పదని బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి అన్నారు. అలాంటి విద్యాభివృద్ధికి,పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహకారం అందిస్తూ దాతృత్వం చాటుకున్న మంద లక్ష్మణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు, టై బెల్ట్, అంగన్‌వాడీ కేంద్రాలకు ఫర్నిచర్, ఫ్యాన్, ట్యూబ్ లైట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తే ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల కంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్న మంచి గౌరవం గుర్తింపు విలువ పొందాలన్న చదువు ద్వారనే సాధ్యం అవుతుందన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహకారం అందించి పాఠశాల అభివృద్ధి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చెయ్యాలనే సంకల్పంతో తన వంతు సాయం చేశామన్నారు. దాతృత్వంతో పాఠశాల అభివృద్ధికి సహకరించిన మంద లక్ష్మణ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేకంగా అభినంధించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిహర ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సౌజన్య, పంచాయతీ కార్యదర్శి మాధవి, అంగన్వాడీ టీచర్లు సరస్వతి, పున్నమ్మ, సిఆర్పి యాదగిరి, పోలీస్ సిబ్బంది దేవరాజ్, అంగన్వాడి ఆయా రేణుక, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## శబరిమాత ఆలయం ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు

**నార్సింగి, అక్టోబర్ 29 (ప్రజల స్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించడం కోసం గ్రామ గ్రామాన నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచడం, స్వచ్ఛదనంపచ్చదనం గ్రామాల్లో నాటడం చేస్తుంది. నర్సరీల నిర్వహణ కోసం ప్రభుత్వ భూములను ఎంపిక చేసి నర్సరీలను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. నార్సింగిలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందున ఇది వరకు ప్రైవేట్ వ్యక్తికి చెందిన భూమిలో నిర్వహిస్తూ, దాని అద్దెను గ్రామ పంచాయతీ భరిస్తూ వచ్చింది. నిధుల కొరత వల్ల అద్దె చెల్లించడం కుదరక పోవడంతో మండల కేంద్రంలోని శబరిమాతా ఆలయం కమిటీతో స్థానిక ఎంపీడీవో ఆనంద్, ఏపీవో రాజేశ్వర్, నార్సింగి పంచాయతీ కార్యదర్శి నాగభూషణంలు సంప్రదించారు. గుడి ఆవరణలో ఖాలిస్థానంలో నర్సరీ నిర్వహణ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేయగా, ఆలయ కమిటీ వారు సానుకూలంగా స్పందించడంతో మంగళవారం నర్సరీని అక్కడికి తరలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**

గత పదేళ్లలో వ్యవసాయం పండగలా జరిగిందని, పండిన పంటలతో రైతులంతా ఆర్థికంగా ఎదిగారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలంలోని బంగ్లా వెంకటాపూర్, గిరిపల్లి అక్కారం, జగదేవపూర్ మండల కేంద్రంతో పాటు ఇటిక్యాల గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. గత ప్రభుత్వం లాగే కడుపులో పెట్టుకొని రైతులని చూసుకోవాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం అధికారులకు స్థానిక నాయకులు సహకరించాలన్నారు. సన్నవడ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.500 బోనస్‌ను రైతులు పొందాలని, వచ్చే పంట కాలానికైనా అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించాలని కోరారు. రైతులంతా ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీకుమార్, గ్రామ మాజీ సర్పంచ్ పాశం బాపురెడ్డి, నాయకులు నర్సింహులు, లడ్డు, నక్కరాములుగౌడ్, కొండల్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌ను 'మూడా' ఏర్పాటు చేయడంపై హర్షం

### మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజొద్దీన్



**మెదక్, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

మెదక్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందుతుందని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫికొద్దీన్, రవి, దమ్ము వెంకట్‌లు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పది నెలల వ్యవధిలోనే ముడా ఏర్పాటు చేసి మెదక్‌ను అభివృద్ధి పథంలో నడిపించానున్నారని తెలిపారు. మూడాతో కేవలం మెదక్ పట్టణమే కాకుండా జిల్లాలోని 289 గ్రామాలను మూడాలో కలుపుతూ, అన్ని గ్రామాలను కూడా అభివృద్ధి చేయనున్నారన్నారు. మూడా వల్ల సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో మెదక్ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడా ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రావు, మంత్రులు దామోదర రాజానర్సింహా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముజీబ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## కాట్రియాలలో ఉచిత వైద్య శిబిరం




**రామాయంపేట, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లారామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో రామాయంపేట పట్టణ సంజీవిని హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో అనేకమంది వృద్ధులు, రోగపీడితులకు అనేక పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ క్షుణంగా పరిశీలించి వారికి సంబంధించిన మందులు అందించామని డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ స్రవంతి రాజేందర్ మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఉండడానికి అనేక వ్యాధులకు అవసరమైన చికిత్సలు పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వ్యాధులకు సేవలందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైలారం శ్యామ్, డాక్టర్ చంద్రం, బిల్లం శ్యామురెడ్డి, చాకలి స్వాములు, కమ్మరి రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్న శంకరంపేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బదిలీ



**చిన్న శంకరంపేట, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**

చిన్న శంకరంపేట తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి మెదక్ తహశీల్దార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా చంద్రశేఖర్ బదిలీపై వెళ్లారు. చిన్నశంకరంపేట తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మూడు సంవత్సరాలు సేవలందించి బదిలీపై వెళ్లడంతో తహశీల్దార్ మన్నన్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ చంద్రశేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రామయంపేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, చిన్న శంకరంపేట తహశీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. చిన్న శంకరంపేట్ తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శ్రీనివాస్ మెదక్ కలెక్టరేట్‌కు బదిలీ అయినట్లు తహశీల్దార్ మన్నన్ తెలిపారు.


ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక



# కుల గణనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

- నవంబర్ 6 నుంచి కులగణన సర్వే చేపట్టాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






**శామీర్‌పేట, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**
రాష్ట్రంలో నవంబర్ 6వ తేదీ నుండి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటిని చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా జరిగిన అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం ఖమ్మం జిల్లా నుండి పాల్గొన్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల కేంద్రాల నుండి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం మన సమాజంలో సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఆ లక్ష్యం మేరకు రాష్ట్రంలో వివిధ జాతుల సామాజిక, ఆర్థిక, ఆదాయ విద్యా, రాజకీయ స్థితిగతులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే మనం మన సమాజంలో సమానత్వం కోసం విధానాలను రూపొందించగలమన్నారు. రాష్ట్రంలో సామాజిక సర్వే ఈ ఉదాత్తమైన లక్ష్యాన్ని సాకారం చేసుకుంటుందన్నారు. జిల్లా కలెక్టర్లుగా మీ అందరికీ ప్రాధాన్యత ఉన్నదని, తమతమ జిల్లాలో లక్షలాది మంది ప్రజానీకానికి న్యాయం చేసేందుకు మీ సేవలు ఒక ప్రాతిపదికగా ఉంటుందని భట్టి అన్నారు. జిల్లా కలెక్టర్లు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, గృహ సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్స్ మాన్యువల్ అదేవిధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్యూమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 57 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్టంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని భట్టి పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సర్వేను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలన్నారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.










## సమగ్ర సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**వికారాబాద్, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**
సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై నిర్వహించే సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించనున్నామన్నారు. సర్వే కోసం ఎమ్యూనేటర్లు, ఎమ్యూనేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలం వారీగా ఎంపీడీవోలు, తహశీల్దార్లు ఎమ్యూనేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్ వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. రెవెన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీల్లో విలీనం కావడంలో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహణ కోసం ఎమ్యూనేటర్లకు సంబంధించిన ప్రత్యేక శిక్షణను ట్రేనర్స్ ఆఫ్ ట్రేనర్స్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే పనిని వేగంగా విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎమ్యూనేటర్లను ఎంపిక చేయాలని, అవసరమైతే అదనంగా ఎమ్యూనేటర్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి తహశీల్దార్, ఎంపీడీవో దగ్గర గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తయిన ఇంటిపై అతికించు స్టిక్కర్ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మండలం వారీగా ఎంత జనాభా ఉంది, ఎంత మంది ఎన్యూమరేటర్లు, ఎంత మంది సూపర్ వైజర్ లు, మున్సిపల్ పరిధిలో ఎన్ని వార్డులు ఉన్నవి, ప్రస్తుతం వార్డు వారి గా ఎలా చేస్తున్నారని, మున్సిపల్ కమీషనర్ లు, ఎం పి డి ఓ లను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్‌లు పీపీటీ ద్వారా సర్వే ఏవిధంగా చేయాలన్నది అందరికి అవగాహన కల్పించారు. అంతకు ముందు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరతి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్డీఏ శ్రీనివాస్, సీపీవో అశోక్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు తలెత్తకుండా పత్తిని కొనుగోలు చేయాలి





**వికారాబాద్, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యాలాల మండల పరిధిలోని అగ్గనూర్ గ్రామ సమీపంలోని మారుతి కాటన్ మిల్లు వద్ద కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వారు ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులకు సూచించారు. అలాగే రైతులు కూడా పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందాలంటే పత్తిని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఎవ్వరు కూడా దళారులను ఆశ్రయించవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, సీసీఐ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు





**మేడ్చల్, అక్టోబర్ 29 (ప్రజాస్వరం) :**
మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్ల పోచంపల్లి 12వ వార్డు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ జన్మదిన వేడుకలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర్జిత 3 క్లబ్ హౌస్‌లో ఘనంగా జరిగాయి. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పూలమల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు సాయిపేట శ్రీనివాస్ అరటిపండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో ఎక్స్ రే మిషన్ పనిచేస్తలేదని తెలుసుకొని సాయిపేట శ్రీనివాస్ కురుమ సొంత డబ్బులు డాక్టర్లకు ఇచ్చి ఎక్స్ రే మిషన్‌ను బాగుచేయించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్‌లు కౌడే మహేష్, నడికొప్పు నాగరాజు ముదిరాజ్, బత్తుల శివకుమార్‌యాదవ్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కౌడే మహేష్ కురుమ, మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగురాజు కురుమ, మేడ్చల్ మండల మాజీ జడ్పీటీసీ శైలజా హరినాథ్, మేడ్చల్ పట్టణ మాజీ వార్డు మెంబర్ కౌడే నాగేందర్ కురుమ, మేడ్చల్ పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు నాచారం బాల మల్లేష్‌యాదవ్, మేడ్చల్ పట్టణ కురుమ సంఘం నాయకులు వినోద్‌కురుమ, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గర్థాస్ నరేందర్, మేడ్చల్ జిల్లా ఎన్‌ఎస్ యూఐ కార్యదర్శి లవంగు రాకేష్ వంజరి, మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్‌ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ, యూత్ కాంగ్రెస్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, రేగు సాయికిరణ్ కురుమ, బ్రహ్మారెడ్డి, సాయిరాం గుప్తా తదితరులు శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కెనరా బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు



**శామీర్‌పేట, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**
కెనరా బ్యాంకు విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంక్ వారోత్సవాల్లో భాగంగా ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శామీర్‌పేట కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించగా ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానం డి.శృతి, ద్వితీయస్థానంలో యు.పల్లవి రాగా తెలుగు మీడియంలో ఎ.విజయలక్ష్మి, ద్వితీయ స్థానంలో జి.మల్లేశ్వరి నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కెనరా బ్యాంక్ విజిలెన్స్ రీజినల్ సౌత్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ గోవింద్ కుమార్ జా, శామీర్ పేట కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ పోరిక సాగర్ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ నుంచి అరుణాచలంకు ఆర్టీసీ బస్




**ప్రజా సర్వం ప్రతినిధి, వేములవాడ:**

సిరిసిల్ల జిల్లా నుంచి అరుణాచల శివాలయం దర్శించుకునే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. వేములవాడ బస్టాండ్ నుంచి అరుణాచలం వరకు ప్రత్యేక బస్ సర్వీస్ను ఏర్పాటు చేశారు. నవంబర్ 13న కార్తీకమాసం ప్రత్యేకమైన పౌర్ణమిగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకై భక్తులు వెళ్తారు. ఈ టూర్ ప్యాకేజీలో కాణిపాకం, వేలూరు మహాలక్ష్మి, అనంతరం అరుణాచలం, తిరుగు ప్రయాణంలో అల్లంపూర్, జోగులాంబ, కరీంనగర్, వేములవాడకు వస్తుంది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విలేకరికి పరామర్శ



**ప్రజా సర్వం ప్రతినిధి, సైదాపూర్:**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ నమస్తే తెలంగాణ రిపోర్టర్ అనగోని తిరుపతి గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకు ఫ్యాక్చర్ కాగా సమాచారం తెలుసుకున్న పీఆర్పీ న్యూస్ ఛానెల్ (ఎండీ &సీఈఓ) పత్తెం రమేష్,మైత్రి రిపోర్టర్ జీడి నాగేష్,సైదాపూర్ సూర్య రిపోర్టర్ బుల్లి రంజిత్,మన తెలంగాణ రిపోర్టర్ పత్తెం శ్రీనివాస్ లు మంగళవారం వారిని పరామర్శించారు.ప్రమాదం జరిగిన తీరును తిరుపతిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## 13వ రోజుకు చేరుకున్న మహా పాదయాత్ర



**ప్రజా సర్వం ప్రతినిధి, కరీంనగర్:**

మంగళవారం మహా పాదయాత్ర 13 రోజు గడప నాగరాజు ఆధ్వర్యంలో భీచుపల్లి గద్వాల్ జోగులాంబ జిల్లా కృష్ణ నది లో సన్నాలు ముగించుకొని హనుమాన్ దేవాలయం లో పూజ లో పాల్గొన్నడి సంపత్ గురు స్వామి ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ ఈ మహా పాదయాత్ర బృందం ఈ లాగే ముందుకు కొనసాగాలని బిచూపల్లి హనుమాన్ దేవాలయం లో పూజలు జరిపించడం జరిగింది ఈ పూజలో కోటేశ్వరరావు గురు స్వామి .సంతోష్ గౌడ్ రామ కృష్ణ శివ గౌడ్ బండారి శ్రావణ్ గోపి కృష్ణ వినయ్ రెడ్డి లడ్డు గురు స్వామి. హరీష్ నరేష్ విజయ్ పాల్గొన్నారని అన్నారు

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన వెంకటేశ్వరపల్లె గ్రామస్తులు



**ప్రజా సర్వం ప్రతినిధి, సైదాపూర్:**

- మార్కెట్ లో ఉండే ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని విన్నపం..
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం...
- సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు..

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్ల పల్లె గ్రామస్తులు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మంగళవారం కలిసి గ్రామ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి,గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.సైదాపూర్ మండలానికి వ్యవసాయ మార్కెట్ మంజూరు అయినందున ఇట్టి వ్యవసాయ మార్కెట్ కు వెంకటేశ్వరపల్లె గ్రామానికి చెందిన ఐదు ఎకరాల స్థలము విరాళంగా ఇచ్చినందుకుగాను అందులో ఉండే ఉద్యోగుల గురించి హమాలీల గురించి సిబ్బంది నియామకాలపై మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. మార్కెట్ లో ఉండే ఉద్యోగాలను వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని,గ్రామంలో వివో మహిళా సంఘం భవన నిర్మాణం కోసం 20లక్షలు ఎస్సీ, మాల కులానికి కమ్యూనిటీ మిగులు పనులకు 10లక్షల నిధులు,వెంకటేశ్వర్లపల్లెలో అంగన్వాడి బిల్డింగు బ్యాలెన్స్ పనులకు 5లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ముదిరాజుల కులస్తులకు దేవుని కుంట,బతుకమ్మ ఆడే బోడబండ స్థలము గుట్ట స్మశాన వాటిక స్థలము ఆకునూరు రెవెన్యూ నుండి వెంకటేశ్వర్ల పల్లె నూతన గ్రామపంచాయతీ వచ్చే విధంగా చూడాలని మంత్రిని వేడుకున్నారు.

ఎస్సీ మాదిగ కులానికి కమ్యూనిటీ హాల్ భవనంకు 10లక్షల రూపాయలు,బతుకమ్మ బండ వరకు సిసి రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాయిశెట్టి చంద్రయ్య,బొడిగె పద్మజ కొమురయ్య,గాజురవేణి వెంకటస్వామి,గాజురవేణి నరసయ్య,గాజరవేణి మల్లయ్య, తాళ్ల చంద్రమౌళి,బోడిగా సంజీవ్, గొల్లపల్లి శ్రీనివాస్,బత్తుల జయపాల్,బొడిగ చంద్రమౌళి, బొడిగ కరుణాకర్,బొడిగ శ్రీకాంత్, రావిశెట్టి రఘుపతి,రాయిశెట్టి ఐలయ్య,రాయచోటి కొమురయ్య, దయ్యాల ఉదయ,పుట్ట కనకయ్య,మెడవేని కొమురయ్య, భాషవేణి కొమురయ్య,గుర్రం మల్లయ్య,చెడమాకి తిరుపతి, మారెళ్ళ ఐలయ్య,మెడవేని సదానందం,శతుకు రవీందర్,వేముల చంద్రమౌళి, సుతుకు లక్ష్మీకాంత్,బొడిగ తిరుపతి,బొడిగ రమేష్,గంగిశెట్టి రాజయ్య,నార్ల శ్రీనివాస్,బూర్తుల తిరుపతి,రాయశెట్టి వనరాజు, కొండి తిరుపతిలు,గ్రామస్తులు మంత్రికి పలు సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు.ఇట్టి సమస్యలపైన మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ కు వెంకటేశ్వర్లపల్లి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి



మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**ప్రజా సర్వం ప్రతినిధి, ఇల్లంతకుంట:**

నియోజవర్గం వ్యాప్తంగా సింగిల్ విండోలు, ఐకేపీ, మార్కెటింగ్ శాఖల ద్వారా ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం అంతగిరి, వంతడ్పుల, తాళ్లపల్లి, గాలిపెల్లి, జవారిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం తూకంలో పారదర్శకంగా పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్,ఎంపీడీవోతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐరెడ్డి చైతన్యమహేందర్ రెడ్డి, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, పార్టీ నాయకులు అంతగిరి వినయ్,కె.భాస్కర్ రెడ్డి,కేశవరెడ్డి,వీరేశం.అనంతరెడ్డి, పి.రాజేం

## పేదలకూ కార్పొరేట్ వైద్యం

డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

**ప్రజా సర్వం ప్రతినిధి, ఇల్లంతకుంట:**

కార్పొరేట్ స్థాయిలో పేదలకు కూడా వైద్యం అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారుమంగళవారం ఆయన ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకునే పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నదని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారరా అందించే ఈ సాయం వారికి పెద్ద రిలీఫ్ అని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్తో పాటు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. మండలంలోని 34 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 9.66 లక్షల రూపాయలు మంజూరైనట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐరెడ్డి చైతన్యమహేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అంతగిరి వినయ్,కె.భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డి,వీరేశం.అనంత రెడ్డి, పి.రాజేందర్ రెడ్డి, నర్సింగం, ఎం.రాజేశం, వెంతకి తోపాటు తహశీల్దార్,ఎంపీడీవో, తదితర అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ కంటికి కనిపించే దేవుళ్ళు



సూపరింటెండెంట్ ను శాలువాతో సత్కరిస్తున్న ప్రభాకర్

**ప్రజా సర్వం ప్రతినిధి, బన్సీలాల్ పేట్:**

ఆపదలో ప్రాణాలు కాపాడి మరో జన్మ ను ప్రసాదించే డాక్టర్లు అపర బ్రహ్మలని గాంధీ ఆసుపత్రి టీ ఎన్ జీ వో యూనిట్ ప్రెసిడెంట్ గంట ప్రభాకర్ యాదవ్ అన్నారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి జన్మదిన వేడుకలను కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ కు పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్,ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్,ఆర్ ఎం వో-1 డా.శేషాద్రి, శ్రవణ్, భావన,విశ్వనాథ్ పాల్గొన్నారు.



## అభివృద్ధి చూసి ఓర్వలేకనే మాజీ శాసన సభ్యుల అసత్యపు ఆరోపణలు

**ప్రజా సర్వం ప్రతినిధి, చిగురుమామిడి:**

మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజక వర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ శాసన సభ్యులు వొడితెల సతీష్ కుమార్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని, బలహీన వర్గాల నాయకుణ్ణి విమర్శిస్తే చూస్తూ సహించబోమని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ తీవ్రంగా హెచ్చరించారు. చిగురుమామిడి మండల కేంద్రములో గీకురు రవీందర్ డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చిటమల్ల రవీందర్ మరియు జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డిలతో కలిసి ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు ఒడితెల సతీష్ కుమార్ రెండుసార్లు శాసనసభ్యులుగా గెలిచి అధికారంలో ఉండి కూడా గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం ఆయన నిర్లక్షానికి నిదర్శనమన్నారు. 2014, 2018 లలో ఎన్నికల ప్రచారంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తానే స్వయంగా కుర్చీ వేసుకుని ప్రాజెక్టును పూర్తి చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచారు. ఇచ్చిన హామీని నెరవేర.

## పాఠ్యాంశాలతో పాటు ఇన్నోవేటివ్ అంశాలపై దృష్టి సాధించాలి



**ప్రజా సర్వం ప్రతినిధి తిమ్మాపూర్:**

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని చిగురు మామిడి మండలం చిన్నముల్కనూర్ లో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నుండి మనకొండుర్ లో కార్యక్రమానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో విద్యార్థులను చూసి వారితో కాసేపు ముచ్చటించారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ బాగా చదువుకోవాలని మంచి ప్రయోజకులు కావాలని సూచించారు పాఠశాలలో గేమ్స్ జరుగుతున్నాయా అని,పాఠ్యాంశాలతో పాటు ఇన్నోవేటివ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

## రసమయి పై భగ్గుమన్న దళిత నాయకులు...

**ప్రజా సర్వం ప్రతినిధి, తిమ్మాపూర్:**



జన్వాడ ఫాంపౌజ్ లో జరిగిన దివాళీ దావత్ లో డ్రగ్స్ వాడినట్టుగా నమోదైన కేసులో పరారీలో ఉన్న ఆ ఫాం హౌజ్ యజమానికి రాజ్ పాకాలతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు ఆరోపించారు. మంగళవా రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (ప్రజా భవన్)లో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు అయినా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎస్సీ సెల్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రెడ్డిగాని రాజు, డీసీసీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, ఇతర నాయ కులు మాట్లాడుతూ...రాజ్ పాకాలతో రసమయి బాల కిషన్ కు బలమైన సంబంధాలున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రాజ్ పాకాల ఇంట్లో రస మయి ఫొటోలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో రసమయి పాత్ర తేలాల్సి ఉందన్నారు. పార్టీలో కొకైన్ మద్దూరి విజయ్ కొకైన్ వాడినట్టుగా పరీక్షల్లో తేలడమే కాకుండా స్వ యంగా ఆయనే పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నందున జన్వాడ ఫాంహౌజ్ లో జరిగింది మందు పార్టీ కాదని, డ్రగ్ పార్టీ అని పేర్కొన్నారు. గులాబీ నేతలు డ్రగ్ పార్టీని మందు పార్టీగా చిత్రీకరిం చే ప్రయత్నం చేస్తున్నారని, ఒక వేళ ఇంట్లో జరిగే విందయితే క్యాసినోలో వాడే కాయిన్లతో పనేమిటని ప్రశ్నిస్తూనే ఇది తెలంగాణ సంస్కృతి కాదని పేర్కొ న్నారు. మైత్రి ఛానెల్ యజమాని కొత్త జయపాల్ రెడ్డి ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణతో గల రాజ కీయ విబేధాలను దృష్టిలో పెట్టుకొని ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తూ ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆరోపించారు. ఛానెల్ ను అడ్డుపెట్టుకొని ఎమ్మె ల్యే పై సాగిస్తున్న తప్పుడు ప్రచారాలపై కొత్త జయ పాల్ రెడ్డి ని కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తే రసమయికి కలిగిన నొప్పేంటని ప్రశ్నిస్తూ, జయపాల్ రెడ్డితో బాలకిషన్ కు గల మైత్రీబంధం ఏందో తేలాలన్నారు. జయపాల్ రెడ్డితో కలిసి రసమయి జరిపిన విదేశీ పర్యనలపై కూడా అనుమానాలు రేకెత్తుతున్నాయని ఆరోపించారు. దళితులను కుక్కలతో పోల్చుతూ రసమయి మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళిత జాతిలో పుట్టి, దళిత జాతి బిడ్డలపై అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషనే అసలైన దళిత ద్రోహి అన్నారు. ఇక ముందు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి పై గానీ దళితులపై కానీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఇక సహించబోమని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తిమ్మాపూర్ లో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం చేతగాని రసమయి ఇప్పుడు విగ్రహం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. విగ్రహాన్ని త్వరలోనే నెలకొల్పేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్య నారాయణ లు హామీ ఇచ్చారని చెప్పారు. దళితులను రసమయి ఏనాడూ పట్టించుకోలేదని, తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితులపై దాడులకు తెగబడటమే కాకుండా అక్రమంగా కేసులు నమోదు చేయించారని, ఇతర సామాజికవర్గానికి చెందిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిం చిన నేరచరిత్ర రసమయిది అని గుర్తు చేశారు.ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు రసమయి బాలకిషన్ అక్రమంగా సంపాదించిన ఆస్తుల చిట్టా కూడా త్వరలో విప్పు తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎస్సీ సెల్ తిమ్మా పూర్ మండల అధ్యక్షుడు రెడ్డిగాని రాజు, డీసీసీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కనుకం అశోక్, మచ్చ రాజేశం, కొంకటి రాములు, నాయకులు చలిగంటి సంపత్, జీడీ శ్యామ్, కోంద్ర సురేష్, టి. జంపయ్య, అలువాల కుమార్, శంకర్, మాతంగి సంతీష్, ఎస్.అనిల్, మానాల రవి ఎస్. శ్రీనివాస్, జే.మధు.శ్రీనివాస్, ఎల్. శ్రీనివాస్, కె.రాములు,ఎం ప్రభాకర్,రాసూరి మల్లికార్జున్, సిరిసిల్ల రాజు, యు.నరేష్. హాసన్, ఎల్ మల్లయ్య, జి.రాజమల్లు, జి.చిట్టిబాబు,కనకం కుమార్, ఎస్ నరేష్ తో పాటు కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల నాయకులు, కార్యక ర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజా సర్వం ప్రతినిధి సైదాపూర్:**

ప్రభుత్వం తరపున ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని వెనేక్కేపల్లి విశాల పరపతి సహకారసంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని 18గ్రామాల్లో విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోని,ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు.కొనుగోలు సెంటర్ కు నాణ్యమైన వడ్లను తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు.ఏ గ్రేడ్ వరిధాన్యం ధర 2320,సన్న వడ్లకు 500రూపాయల బోనస్ ప్రభుత్వం అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండారపు శ్రీనివాస్,డైరెక్టర్లు బొమ్మగాని రాజు,నమిడ్ల జమున,గుండేటి జయకృష్ణ,పల్లెని ప్రవీణ్ రావు, ఏలూరు తిరుపతిరెడ్డి,చాడ ప్రకాష్ రెడ్డి,ఓలద్రి మహిపాల్ రెడ్డి, గుగులోతు లక్ష్మి,నాయకులు రాఘవులు,ఎర్రల శ్రీనివాస్,భాషవేణి సంపత్,కచ్చు రవి,తిప్పారపు భువన చంద్ర,తదితరులు పాల్గొన్నారు.



# హైదర్‌గూడలో ఉచిత వైద్య శిబిరం

**తూప్రాన్, అక్టోబర్ 29 ప్రజాస్వరం :**

మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి హైదర్‌గూడలో తూప్రాన్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించి అవసరమున్న వారికి మందులను అందజేశారు. అంతకుముందు తూప్రాన్ ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ధన్వంతరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తూప్రాన్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆయుర్వేదిక్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు వెంటనే ప్రారంభించాలి



**ప్రజా సర్వం ప్రతినిధి ముస్తాబాద్:**

ముస్తాబాద్ మండలంలో అన్నీ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు వంగూరి దిలీప్ తెలిపారు. ఇప్పటికి వరకు కూడా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టలేదని,రైతు ప్రభుత్వం అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ధాన్యం తూకం వేయకుండా రైతులను మోసం చేస్తున్నారని,ఇప్పటికే సగానికి పైగా తక్కువ రేటుకు రైతులు రైస్ మిల్ కి ధాన్యాన్ని అమ్మేయడం జరిగిందని వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి



**చేగుంట, అక్టోబర్ 29(ప్రజా స్వరం) :**

మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో భూగర్భజలాల పెంపుదలపై జిల్లా భూగర్భ జల శాఖ అధికారి సతీశ్‌కుమార్ యాదవ్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శిలకు, ఇజీఎస్ సిబ్బందికి మహిళ సంఘాల సభ్యులకు భూగర్భజలాల నిర్వహణ, భూగర్భజలాల పెంపుదలపై అవగాహన కల్పించారు. భూగర్భజలాలను పొదుపుగా వాడాడం వాటిని ఎలా సంరక్షించుకోవాలనే అంశాలపై జిల్లా భూగర్భజల శాఖ అధికారి సతీష్‌కుమార్ యాదవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నరెడ్డి, ఎంపీవో ప్రశాంత్, ఏపీఎం లక్ష్మినర్సమ్మ, ఏపీవో శ్వేత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సస్పెండ్ చేసిన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి



**దౌల్తాబాద్, అక్టోబర్ 29(ప్రజాస్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన ఏఈవోలను వెంటనే విధులలోకి తీసుకోవాలని దౌల్తాబాద్ ఏఈవోలు సంతోష్ కుమార్, శిరీష, సునందలు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రం రైతు వేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మండలంలోని ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయిన డిజిటల్ క్రాప్ సర్వే దేశంలో 11 రాష్ట్రాలలాగా మన రాష్ట్రంలో కూడా ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చి 1000 ఎకరాలకు ఒక వ్యక్తిని మించకుండా చేయాల్సిందని, అందుకుగాను ప్రతి ఫారంకు నిధులు కూడా వచ్చాయన్నారు. ఇవే నిధులను మిగితా 11 రాష్ట్రాల ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి చెపిస్తున్నాయన్నారు. కానీ ఇందుకు భిన్నంగా మన రాష్ట్ర వ్యవసాయ శాఖలో వ్యవసాయ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ మన రాష్ట్రంలో ఈ పనిని ఇదివరకే వివిధ పథకాలు, శాఖపరమైన విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను బలవంతంగా చెపించడంపై అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్న తరుణంలో ఈ డిజిటల్ క్రాప్ సర్వేకే సంబంధంలేని రైతుభీమా పథకాన్ని బూచిగా పెడుతూ రాష్ట్రంలో అమాయకులైన 165 మందిని సస్పెండ్ చేశారన్నారు. ఈ నకిలీ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని అక్టోబర్ 23న వ్యవసాయ డైరెక్టర్‌ను కలిస్తే అదే రోజు సాయంత్రంలోగా సస్పెన్షన్ రద్దు చేస్తామని, ఇప్పటి వరకు రద్దు చేయలేదన్నారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ వెంటనే సస్పెన్షన్స్ రద్దు చేయాలని నిరసన తెలిపామన్నారు.

# మాట నిలబెట్టుకున్న గజవాడ నాగరాజు

**రామాయంపేట, అక్టోబర్ 29 (ప్రజా సర్వం) :**

రామాయంపేట పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజవాడ నాగరాజు తన 46వ జన్మదినం సందర్భంగా రామాయంపేట పురపాలక సంఘంలో సఫాయి కార్మికురాలీగా పనిచేస్తున్న కోతి అనితకు 200 చదరపు గాజాల స్థలంలో నూతన గృహం నిర్వహిస్తానని మాటిచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం నాగరాజు ఇళ్లుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిల్‌కుమార్, హౌసింగ్ గుత్తేదారు ఎల్లయ్య, వార్డు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం, వైద్యం, టెక్నాలజీ అంశాలపై అవగాహన



**శామీర్‌పేట, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలు తెలుసుకోవాలని విజిలెన్స్ అధికారి పిల్లి కృష్ణ కుమార్ అన్నారు. ఈసీఐఎల్ కంపెనీ టీం ఆధ్వర్యంలో అలియాబాద్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఆరోగ్యం, వైద్యం, టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్య, వైద్యం, టెక్నాలజీ తదితర అంశాల్లో లాభా, నష్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి యాదగిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం



**శామీర్‌పేట, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా అలాగే అంబటి వేణు కుమార్ ఆర్థికసాయం చేశారు. గుత్తికొండ సాయి కృష్ణ 25 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.





# బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

**రామాయంపేట, అక్టోబర్ 29 (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట సర్కిల్ పరిధిలోని పట్టణంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలని రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రాజ్‌గౌడ్ తెలిపారు. రామాయంపేట సర్కిల్ పరిధిలో దీపావళి సందర్భంగా చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా అనుమతి లేకుండా బాణసంచా ఇళ్లల్లో షాపుల్లో జన సముదాయాల మధ్య గోదాంలలో నిల్వ చేసిన లేదా లైసెన్స్ లేకుండా అనధికార విక్రయాలు జరిపిన, పోలీసుల నిబంధనలను పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన వారు దీపావళి సామాగ్రి ఉన్న ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ కచ్చితంగా పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# అలయ్ బలయ్ సంబురం



**శామీర్‌పేట, అక్టోబర్ 29 (ప్రజా స్వరం) :**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా పండుగలు నిర్వహించుకోవాలని రాష్ట్ర ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. మంగళవారం దీపావళి పునస్కరించుకొని ప్రతి ఏటా నాయిని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ్ బాలయ్ కార్యక్రమాన్ని శామీర్‌పేటలో ఘనగా నిర్వహించారు. పండుగ పూట కుల బంధువులు అందరు ఒకటిగా కలుసుకొని సుఖ సంతోషాలను తెలుసుకొని మంచి చెడు మాట్లాడుకొనే ఒక చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయి, మహేందర్ నాయి, మనోహర్ నాయి, జిల్లా అధ్యక్షులు చిటకుల సత్యం నాయి, మండల అధ్యక్షుడు, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999